ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
జయశంకర్ భూపాలపల్లి
శనివారం 22 నవంబరు 2025



సరస్వతి అంత్య పుష్కరాలు విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ



సరస్వతి ఘాట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : సరస్వతి అంత్యపుష్కరాలు దిగ్విజయంగా నిర్వహించడానికి భక్తులకు చేయాల్సిన సౌకర్యాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. శుక్రవారం కాళేశ్వరం ఈవో కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాలు, కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక తదితర అంశాలపై రెవెన్యూ , పోలీస్, దేవాదాయ, ఆర్ అండ్ బీ, పంచాయతీ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, విద్యుత్ ఇరిగేషన్, మిషన్ బగీరథ, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా చేపట్టాల్సిన పనుల పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం కాళేశ్వరంలో మే 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగనున్న సరస్వతి అంత్య పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సరస్వతి ఘాట్‌ను కలెక్టర్ పరిశీలించారు. కళ్యాణ కట్ట భవనంలో నిర్మాణంలో జాప్యం జరుగుతోందని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, దేవాలయ ఈవో మహేష్, ఆర్ అండ్‌బీ ఈఈ రమేష్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ డీఈ పాపిరెడ్డి, డివిజన్ పంచాయతీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ రామారావు, ఇరిగేషన్ డీఈ ప్రకాష్, దేవాదాయ శాఖ ఏఈ అశోక్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి ముందస్తు ఏర్పాట్లు

- భద్రత కట్టుదిట్టం చేసిన పోలీసులు

6లో



ఆర్టీసీ ప్రాంగణం చదును చేస్తున్న ట్రాక్టర్లు

■ సీన్ రివర్స్

అంచనాల పెంపులో అక్రమాల కంపు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ఫోరెనిక్స్ ఆడిట్‌లో తేలిన నిజాలు

- సుమారు రూ.600 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారణ?
- రూ.1116 కోట్ల నుంచి రూ.1725.95 కోట్లకు పెంచిన గత బీఆర్ఎస్ సర్కారు
- అంచనా వ్యయాన్ని రూ.167.95 కోట్ల మేర తగ్గించిన కాంగ్రెస్ సర్కారు
- జైలు స్థలం తాకట్టు పెట్టి తెచ్చిన రుణంపై విజిలెన్స్ విచారణ
- ఫోరెనిక్స్ ఆడిట్ నివేదిక వచ్చినా, ఇంకా అందని విజిలెన్స్ నివేదిక
- మార్చి నాటికి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి చేసేలా ప్రభుత్వం కసరత్తు
- అంచనాల పెంపులో అక్రమాలపై ముదురుతున్న రాజకీయం



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వరంగల్ నడిబొడ్డున ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అంచనా వ్యయం భారీగా పెంపు వాస్తవమేనని ఫోరెన్సిక్ ఆడిట్ బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఎలాంటి అనుమతులు లేకుండా గత ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో ఆస్పత్రి అంచనా వ్యయాన్ని పెంచిందని తేల్చినట్లుగా సమాచారం. పనులు మొదలు పెట్టి.. ఏడాది గడవక ముందే వ్యయాన్ని రూ.625 కోట్లకు పైగా పెంచడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోరెనిక్స్ ఆడిట్‌కు ఆదేశించారు. అయితే ఇదే సమయంలో ఆస్పత్రి అకృతి, జైలు భూముల తాకట్టుపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ కూడా జరుపుతోంది. ప్రస్తుతం ఫోరెనిక్స్ నివేదిక వచ్చినప్పటికీ విజిలెన్స్ నివేదిక రాకపోవటంతో ప్రభుత్వం చర్యలు వెనుకాడుతోంది. మరోవైపు మార్చిలోపు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది.

అంచనాల్లో అక్రమాలేనా..?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 జూన్ 22న 2వేల పడకలతో నిర్మించనున్న

(మిగతా 7లో..)

ములుగు ఎస్పీగా సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



నూతన జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్

ములుగు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ మానుకోట ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈయన 2023 డిసెంబర్‌లో నియమితులయ్యారు. మహబూబాబాద్ ఎస్పీగా పనిచేస్తున్న సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌ను ములుగు జిల్లా ఎస్పీగా నియ మిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతం లో ములుగు అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించారు. జాత ర సమయంలో ఎస్పీల బదిలీలపై సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.

ఓఎస్డీగా శివమ్ ఉపాధ్యాయ

ఓఎస్డీగా శివమ్ ఉపాధ్యాయ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఏటూర్‌నాగారం ఏఎస్పీగా పనిచేస్తున్నారు. ఆయన స్థానంలో ఏటూర్‌నాగారం ఏఎస్పీ మన్‌భట్‌ను నియమించారు.

భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్

- ఎస్పీ కిరణ్ ఖరే బదిలీ



నూతన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

కృష్ణకాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో నూతన ఎస్పీగా సిరిశెట్టి సంకీ ర్త్‌ను నియమించింది. సంకీర్త్ ప్రస్తుత ం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఏడీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఈయన ములుగు జిల్లా ఏటూర్‌నాగారం ఏఎస్పీగా సైతం విధులు నిర్వర్తించారు. కాగా, నూతనంగా నియామకమైన ఆయన సోమవారం విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.



- అమలు కాని ఉద్యోగులు, ఉపాధ్యాయుల హామీలు..
- చర్చలు జరిగినా దక్కని ఫలితాలు..
- ఆందోళనకు సిద్ధమవుతున్న సంఘాలు..



ఆశపడి గోసపడుతూ..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ధర్నా (ఫైల్)



భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏరు దాటినాక తెప్ప తగలెట్టినట్టు ఉంది ప్రభుత్వాల తీరు.. అధికారంలోకి వచ్చే ముందు అడ్డగోలు హామీలిచ్చి.. పదవులు చేపట్టాక మొండి చేయి చూపుతున్న తీరు ఉద్యోగులను, ఉపాధ్యాయులను నైరాశ్యంలోకి నెట్టివేస్తోంది. ప్రభుత్వాలు మారినా.. ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కులు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. చర్చలు జరిగినా.. ఇంకా ఫలితాలు దక్కడం లేదని సంఘాలు వాపోతున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ అమలు, డీఏల చెల్లింపు, జీపీఎఫ్ నిధుల విడుదల, విరమణకు రావాల్సిన బెనిఫిట్స్ గురించి ఎన్నో పోరాటాలు చేసిన దరిమిలా ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చి, చర్చలకు పిలిచి నెలలు గడుస్తున్నా.. అవి మాత్రం పరిష్కారం కాకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యా యుల్లో నిరాశ నిస్పృహలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రధాన సమస్యలు ఇవే..

ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా.. హామీలు ఇస్తున్నారే తప్పా.. వాటిని పరిష్కారం చేయడం లేదని వివిధ సంఘాల నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ (పే రివిజన్ కమీషన్) 2022లో అమలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కాలేదు. అలాగే ప్రతి 6 నెలలకు ఒకసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజువారీ భత్యం (డీఏ) కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వాటా ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకు 5డీఏలు రావాల్సి ఉందని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. అలాగే జీపీఎఫ్ నిధులు (గ్రాట్యూటీ ప్రావిడెంట్ ఫండ్) రావడం లేదు. ఈ నిధులు 2004కు ముందు ఉద్యోగంలో చేరిన వారికి మాత్రమే వర్తిస్తుందని, అయితే ఈ నిధులు ఉద్యోగి వేతనం నుంచి, ప్రభుత్వం నుంచి వేర్వేరుగా సమకూర్చుతుంది. ఈ నిధులను ఉద్యోగికి అత్యవసర సమయంలో ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఏళ్లు గడుస్తున్నా.. ఈ నిధులను ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మెడికల్స్ బిల్స్ సకాలంలో రావడం లేదని చెబుతున్నారు. ఉద్యోగికి ఏమైనా అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత బిల్లులను ప్రభుత్వానికి పెట్టుకుంటే వాటిని (మిగతా 8వ పేజీలో...)

డిజిటల్ సాధనాల ద్వారా విద్యను బలోపేతం చేయాలి

- క్వాలిటీ కో ఆర్డినేటర్ పింగిళి విజయపాల్‌రెడ్డి



శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న క్వాలిటీ కో ఆర్డినేటర్ పింగిళి విజయపాల్‌రెడ్డి

భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ సాధనాల ద్వారా విద్యను బలోపేతం చేయాలని క్వాలిటీ కో ఆర్డినేటర్ పింగిళి విజయపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భూపాలపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోవిడ్ అనంతరం ఉన్నత విద్య స్వరూపమే మారిపోయిందని అన్నారు. డిజిటల్ బోధన అనివార్యంగా తెరపైకి వచ్చిందని అన్నారు. ఇంటర్నెట్ అనుసంధానం, రిమోట్ లెర్నింగ్ సర్వసాధారణమైందని అన్నారు. కృత్రిమ మేథా, వర్చువల్ రియాలిటీ, లెర్నింగ్ ఎనలిటిక్స్ ఇక మీదట విద్యారంగ పురోగతికి అదనపు సాధనాలుగా మారబోతున్నాయని అన్నారు. డిజిటల్ విద్యకు మౌలిక వసతులు కీలకమని, సరైన అధ్యాపక వర్గమే ఆయువు పట్టు కాగా బోధకులు విద్యార్థులు ఇరువురికి డిజిటల్ నైపుణ్యాలు ఉండి తీరాల్సిందేనని అన్నారు. అందుకే డిజిటల్ విద్యను బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

మీ-సేవ కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు మండలాలు, గ్రామాలకు మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేయుటకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు వివరాలు వెల్లడించారు. రేగొండ మండలంలోని కనిపర్తి, గణపురం మండలంలోని గాంధీనగర్, టేకుమట్లలోని గరివి ఎళ్లపల్లి, చిట్యాల మండలంలోని అందుకుతండా, గిద్దె ముత్తారం, భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు, గొల్లబుద్దారం, జంగేడు, మహదేవపూర్‌లోని మహదేవపూర్, కాటారంలోని దామెరకుంటలలో మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కాగా వీటికి దరఖాస్తు చేసుకునే వారికి కనీస అర్హతల ఉండాలని సూచించారు. అభ్యర్థులు స్థానికులై ఉండాలని, కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసి ఉండాలని, 21 నుంచి 44 ఏళ్ల వయస్సు ఉండాలని, మీ సేవ కేంద్రం ఏర్పా టుకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన కోసం పెట్టుబడి పెట్టే స్థోమత ఉండా లని, గ్రాడ్యుయేషన్, అంతకంటే ఎక్కువ విద్యార్హతల కలిగి ఉండాలని, ఎంపికైన అభ్యర్థులు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ సమర్పించాలని తెలిపారు. ఈ నెల 24 నుంచి డిసెంబరు 1 వరకు దరఖాస్తు స్వీకరించబడునని తెలిపారు. అయితే తహసీల్దార్ చే స్థానికత సర్టిఫికెట్ పొంది, అన్ని సర్టిఫికెట్లపై గెజిటెడ్ సంతకాలు చేసి ఉండాలని సూచించారు.

ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి బదిలీ

వాజేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాజేడు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి బదిలీ అయ్యారు. వాజేడు ఎఫ్ఆర్‌వోగా బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు కావస్తున్న నేపథ్యంలో ఆయనను ఫారెస్టు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయనను జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ రేంజ్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో వెంకటాపురం ఎఫ్ఆర్‌వో వంశీకృష్ణకు వాజేడు ఎఫ్ఆర్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

మల్లూరులో ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ పూజలు



ఆశీర్వాదం తీసుకుంటున్న ప్రభాకర్

మంగపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి గాంచిన మండలంలోని శ్రీ మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం కాళేశ్వరం సర్కిల్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. మల్లూరు దేవస్థానానికి విచ్చేసిన ప్రభాకర్‌కు ఆలయ సిబ్బంది సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ముక్కాముల రాజశేఖర శర్మ ప్రభాకర్ కుటుంబ సభ్యుల నామ గోత్రాలపై అర్చన చేశారు. అనంతరం మల్లూరు క్షేత్ర స్థల పురాణం, ఆలయ విశిష్టతలను వివరించి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సమ్మక్క పూజారికి మాతృ వియోగం

తాడ్వాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవత సమ్మక్క పూజారికి మాతృవియోగం జరిగిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పూజారి సిద్దబోయిన వెంకన్న తల్లి సిద్దబోయిన చిలకమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందిందని కుటుంబ సభ్యులు, పూజారులు తెలిపారు. అయితే ములుగు వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి మృతురాలి ఇంటికి వెళ్ళి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళిలు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి సంపత్, జాలపు అనంతరెడ్డి, బత్తిని రాజు, పీరిల వెంకన్న, జాలిగపు జంపన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ సీఎండీ

కృష్ణకాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, రక్షణ, వై ద్య సేవల మెరుగుదల వంటి అంశాలపై సింగరేణి సంస్థ చైర్మన్ ఎన్. బలరాం నాయక్ శనివారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉండనుంది. వివిధ అంశాలపై సలహాలు, సూచనల కోసం 040-23311338 అనే నెంబర్‌లో సంప్రదించాలని సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో కోరింది.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

గణపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రామప్ప చెరువు నుంచి వంగ పెల్లివాని చెరువుకు రూ. 14 కోట్ల నిధులతో పూర్తయిన ఫీడర్ ఛానల్‌ను ప్రారంభించారు. అనంతరం మండలంలోని మైలారం, గాంధీనగర్, గణపురం, అప్పయ్యపల్లి, బస్వరాజుపల్లి, పరుశురాంపల్లి, నగరంపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభించారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలన్నారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుమార్, మండలాధ్యక్షుడు రాజేందర్, శ్రీనివాస్ ఉన్నారు.



బస్వరాజుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన

ఏటూరునాగారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో నేషనల్ హెల్త్ మిషన్(ఎన్.హెచ్.ఎం) పథకం కింద పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల పెండింగ్ జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడు నుంచి ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమై రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి, హెల్త్ కమిషనర్‌కు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో, ఈనెల 20న హైదరాబాద్‌లోని హెల్త్ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా నిర్వహించామని తెలిపారు కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ల, ఉద్యోగులు ప్రభుదాస్, గణేష్, శ్వేత, సంధ్యారాణి, నిర్మల, చిటమట గంగాధర్, లక్ష్మణ్, బతుకమ్మ, స్రవంతి, రంజిత్‌కుమార్, మణిదీప్, రాకేష్, దేవరాజ్, బిక్షపతి, గంగ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీలకు నగదు బదిలీ చేయాలి



ముదిరాజ్ మహాసభ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మత్స్యకారులు

చిట్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ మత్స్యకారులకు ప్రభుత్వం ఉచిత చేప పిల్లలకు బదులు నగదును అందించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య కోరారు. శుక్రవారం ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకలను మండల కేంద్రంతో పాటు భీష్మనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెండాను ఎగురవేశారు. అనంతరం రమేష్, సదయ్య మాట్లాడుతూ ఉచితంగా చేప పిల్లల పంపిణీలో నాణ్యత లోపిస్తుందని దీంతో మత్స్యకారులు నష్టపోతున్నారని తెలిపారు. ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు నిధులు కెటాయించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంకెళ్ల చంద్రయ్య, గుండా రవీందర్, స్వామి, సాద శ్రీనివాస్, బొలవేణి రఘు, గుండా సురేష్, పిట్టల నాగరాజు, అనిల్, ఓదెలు, సంతోష్, సదయ్య, అశోక్, గోల్కొండ శ్రీనివాస్, మొగిలి, రాజు, మల్లయ్య, జెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారులు

కాటారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని పలు గురుకులాలను ప్రత్యేకాధికారులు శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకులాన్ని తహసీల్దార్ నాగరాజు, ఎస్టీ బాలుర గురుకులాన్ని ఎంపీవో వీరస్వామి గురుకులాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫ్రైడే ఫుడ్ విత్ చిల్డ్రెన్ అనే కార్యక్రమంలో భాగంగా గురుకులాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. భోజనాన్ని, వంట సరుకులు నిల్వ చేసిన తీరును, నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం, తాగడానికి శుద్ధజలం అందుతుందా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గురుకులాల ప్రిన్సిపాల్స్ గట్టయ్య, రాజేందర్, జీపీ కార్యదర్శి సమీర్‌ఖాన్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి ముందస్తు ఏర్పాట్లు

భద్రత కట్టుదిట్టం చేసిన పోలీసులు

తాడ్వాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వనదేవతలు సమ్మక్క సారలమ్మలను ముందస్తుగా దర్శించుకోవడానికి మేడారం తరలివస్తున్న భక్తులకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నమని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం టీఎస్‌పీసీ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. దేవస్థానంలో, ముఖద్వారాల వద్ద, ప్రధాన కూడలిలో, చెక్‌పోస్టుల వద్ద రెక్కీ నిర్వహిస్తూ భక్తులకు సహకరించే విధంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 50 మంది టీఎస్‌పీసీలు, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

భక్తులకు మెరుగైన ప్రయాణం

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వరంగల్ రీజియన్ మేనేజర్ విజయబాను తెలిపారు. మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. భక్తులు వినియోగించుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ సౌకర్యాల పనులు ప్రారంభం

2026 జనవరి 28 వ తేదీ నుంచి 31వరకు మేడారంలో జరిగే మహా జాతరకు ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం ఉపయోగించుకొని వచ్చే భక్తుల సౌకర్యాల పనులను టీజీఎస్ ఆర్టీసీ శాఖ ఆధ్వర్యంలో ప్రాంగణం చదును పనులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో భక్తులకు టికెట్ కౌంటర్లు, విశ్రాంతి షెడ్‌లు, ప్లాట్‌ఫామ్‌లు, సిబ్బంది వసతి వంటి తాత్కాలిక నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

పునర్ ప్రతిష్ఠాపన గద్దెలకు రాతి నిర్మాణ పనులు

మేడారంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మల దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల పునరుద్ధరణ బేస్‌మెంట్ పనులు ముగిశాయి. అంతేకాకుండా రాతి నిర్మాణ పనులను అధికారులు చేపట్టారు. మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో అధికారులు పనుల్లో వేగం పెంచారు గద్దెల పునర్ ప్రతిష్ఠాపన చేసేందుకు పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. శుక్రవారం వరకు రాతి శిలలు గద్దెలపై నిలిపారు. మరో వారం రోజుల్లో గద్దెల పునర్నిర్మాణం పూర్తవుతుందని అధికారులు తెలిపారు.



గద్దెల నిర్మాణంపై రాతి శిలలు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమంపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జిల్లా కోఆర్డినేటర్లు, వసతి గృహాల పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, అన్ని రెసిడెన్షియల్, వసతి గృహాల ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు, ఎస్‌వోలు, హెచ్‌డబ్ల్యూవోలు, పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డైట్, కాస్మోటిక్ చార్జీలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇంతకుముందు ప్రతి శుక్రవారం ఫుడ్‌విత్ చిల్డ్రన్ కార్యక్రమం నిర్వహించామని, అది అమలు జరగడం లేదని అన్నారు. ఇకనుండి తూచా తప్పకుండా అమలు చేయాలని అన్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. బాలికల వసతి గృహాల్లో తప్పక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, బీసీ, ఎస్సీ, సంక్షేమ అధికారి ఇందిరా, కాటారం డీఎస్పీ సూర్యనారాయ ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, వసతి గృహాల పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ప్రిన్సిపాల్స్, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు

మేడారంలో లంబాడీల అక్రమ నిర్మాణాలను తొలగించాలి



ఐటీడీఏ కార్యాలయంలో మాట్లాడుతున్న రవి

ఏటూరునాగారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారాలమ్మ ఆదివాసీల పవిత్ర గడ్డ అని, మేడారంలోకి అక్రమంగా వలస వచ్చిన లంబాడీల నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం(ఏఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఏఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్ అధ్యక్షతన నిర్వహించిన పత్రికా సమావేశంలో రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం మేడారంలోకి ఒక కుటుంబంతో మొదలైన లంబాడీల వలసలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయని, స్థానిక ఆదివాసీల అమాయకత్వాన్ని నిర్మిణాలు చేపడుతున్నారని ఆరోపించారు జిల్లా కలెక్టర్, స్థానిక తహసీల్దార్ వెంటనే స్పందించి మేడారంలోని లంబాడీల అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే, ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ విద్యార్థి సంఘం నుంచి తీవ్ర ఆగ్రహ జ్వాలలు వస్తాయని, గతంలో 2017 డిసెంబరు 17న ఏం జరిగిందో మళ్ళీ అదే జరగక తప్పదని హెచ్చరించారు. మేడారం నుంచి లంబాడీలను తరిమికొట్టడానికి స్థానిక యువత సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి ంఘం నాయకులు అలం స్వామి, వెంకటేష్, మోకాళ్ళ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వారి హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధులు కుటుంబ వ్యవస్థకు మూలాధారమని, వారి సంరక్షణ కోసం 2017లో తీసుకువచ్చిన చట్టాన్ని 2022లో సవరించడం జరిగిందని అన్నారు. ఈ చట్టం ప్రకారం జిల్లాలోని వయోవృద్ధులకు ఏమైనా సమస్యలు ఉంటే ఆర్డీవోకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని, ఆ సమస్య పరిష్కారం కాని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమ ఫోరం జిల్లా అధ్యక్షుడు పాశం రామ్మూర్తి మాట్లాడుతూ జిల్లా వయోవృద్ధుల సంక్షేమశాఖ తరపున వయోవృద్ధులకు వివిధ అంశాల్లో వివిధ క్రీడాపోటీలు, కవితాపోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమం కోసం కట్టుబడి ఉంటామని అధికా రులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వయో వృద్ధులను శాలువాలతో సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వయోవృద్ధుల జిల్లా ఫోరం నాయకులు, ములుగు, ఏటూరునాగారం సీడీపీవో కె.శిరీష, ఈపీ ప్రేమలత, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చుంచు రమేష్, డీసీపీవో ఓంకార్, వృద్ధుల సంక్షేమశాఖ ఇన్‌చార్జి నాగేంద్ర, ఎఫ్ఆర్‌వో గణేష్, డీఎంసీ రమాదేవి పాల్గొన్నారు.



వయోవృద్ధులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు, అధికారులు

ఏటూరునాగారం ఏఎస్పీ బదిలీ

నూతన ఏఎస్పీగా మనన్ భట్



మనన్ భట్

ఏటూరునాగారం నవంబరు21(ఆంధ్రజ్యోతి) నక్సల్ ప్రభావిత ప్రాంతమైన ములుగు జిల్లా పోలిసు యంత్రాంగంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఏటూరునాగారం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ)గా మనన్ భట్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఏటూరునాగారం ఏఎస్పీగా పని చేస్తున్న శివం ఉపాధ్యాయను ములుగు జిల్లా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా బదిలీ చేశారు.

2023 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మనన్ భట్ జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వారు. యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో ఆల్ ఇండియా 88వ ర్యాంకు సాధించి తెలంగాణ కేడర్ ఐపీఎస్‌గా ఎంపికైన ఆయన ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత కాలంగా ఖాళీగా ఉన్న ములుగు ఏఎస్పీ పోస్టులో శివం ఉపాధ్యాయను నియమించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పోస్టుకు ఇన్‌చార్జిగా డీఎస్పీ రవీందర్ వ్యవహరిస్తున్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతమైన ములుగుతో అనుబంధం ఉన్న అధికారులకే బాధ్యతలు అప్పగించాలనే ప్రభుత్వ ఉద్దేశంతో శివం ఉపాధ్యాయను ఓఎస్డీగా నియమించినట్లు తెలుస్తుంది. ఆయన స్థానంలోనే మనన్ భట్‌కు ఏటూరునాగారం ఏఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.

బాండ్ మొక్కజొన్న సాగుకు అగ్రిమెంట్ తప్పనిసరి

వెంకటాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాండ్ మొక్కజొన్న పంట సాగుకు రైతులు తప్పకుండా ఆకంపెనీ ఆర్గనైజర్లతో అగ్రిమెంట్ చేసుకోవాని జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మొక్కజొన్న డీలర్లతో సమావేశమై మాట్లాడారు. రైతులకు అగ్రిమెంట్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని సూచించారు. రైతులు ఆర్గనైజర్ల వద్దనుంచి కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుమందులకు తప్పకుండా బిల్లులు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో ఏటూరునాగారం ఏడీఏ అవినాష్‌వర్మ, మండల వ్యవసాయ అధికారి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో

భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాహనాలు కొంతసేపు నిలిచిపోగా రాకపోకలకు అంతరాయం కలిగింది.

దీంతో పోలీసులు జోక్యం చేసుకుని నాయకులను అరెస్ట్ చేసి మరలా విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ పైడిపల్లి రమేష్ మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్‌కు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్ల రాజయ్య, క్యాతరాజు సాంబమూర్తి, జోగ బుచ్చయ్య, బర్ల గట్టయ్య, రాజమౌళి, రజిత, పుష్ప, పున్నం, అంజయ్య, అశోక్, స్వప్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండాయిలో పర్యటించిన అడిషనల్ కలెక్టర్

ఏటూరునాగారం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయిలో అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) మహేందర్‌జీ శుక్రవారం పర్యటించారు. గ్రామానికి చేరుకున్న అడిషనల్ కలెక్టర్‌కు గోవిందరాజుల ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న ఆయన గోవిందరాజులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవిందరాజుల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని, అభివృద్ధికి నిధులను మంజూరు చేసి పనులను త్వరలోనే చేపడుతామని ఆయన హామీఇచ్చారు.

అదేవిధంగా కొండాయి- ఊరట్టం తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే చేపడుతామని, మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డు నిర్మాణాలను చేపడుతామన్నారు. కొండాయిలోని ముంపు ప్రాంతాల ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, మహేందర్ జీ అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలతో సమావేశమై మాట్లాడుతూ ఎత్తు ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణాల కోసం స్థల సేకరణను చేపడుతున్నామని, స్థల సేకరణ కాగానే ఇంటి నిర్మాణాలను ప్రారంభిస్తామన్నారు. గతంలో వరదలకు కొట్టుకుపోయిన జంపన్నవాగు కరకట్ట నిర్మాణాన్ని చేపడుతామని హామీనిచ్చారు. ప్రజలు అధైర్యపడకుండా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

మహాముత్తారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతి, భోజనం, విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కూరగాయల సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆయన దృష్టికి రావడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందకపోవడంపై వెంటనే విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఎంఈవోకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను అందించడంలో విఫలమైతే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. తదనంతరం ఆయన మండలంలోని మీనాజీపేట, కోనంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అధికారులకు వెంటనే కొనుగోలు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్, సహకార అధికారి వాలియా నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో శ్రీధర్ పాల్గొన్నారు.



కోనంపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్

వెసెక్టమీ ఆపరేషన్ల కోసం అవగాహన కల్పించాలి

భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెసెక్టమీ ఆపరేషన్ల కోసం అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యశా ఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ మధుసూదన్, వైద్యులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం డీఎంఎండీవో కార్యాలయంలో జిల్లాలోని మెడికల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రతి ఆరోగ్య ఉపకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు వెసెక్టమీ క్యాంపు నిర్వహణ కోసం అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేలా పనిచేయాలని సూచించారు. పురుషులను ప్రధానంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ నెల 21 నుంచి 27వరకు ఎంఎస్వీ క్యాంపులు కోసం మొబిలైజేషన్ చేయాలని అన్నారు. అన్ని గ్రామాల్లోని ఉప కేంద్రాలలో జరిగేటట్లు సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. ఈ ఆపరేషన్ ఎటువంటి నష్టం లేదని స్పష్టం చేయాలని చెప్పారు. సర్వీస్ డెలివరీ పేస్ ఈ నెల 28 నుంచి డిసెంబరు 4 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీవోలు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలి

గోవిందరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పిల్లలకు చేరేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డి సూచించారు. కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమంలో భాగంగా ఏ బుక్ ఆన్ డిజిటల్ లర్నింగ్‌పై మండలకేంద్రంలో గణితం, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు శుక్రవారం జరిగిన శిక్షణను ఆయన ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా డీఈవో సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను డిజిటల్‌రంగంలో కూడా ప్రావీణ్యులను చేసేవిధంగా శిక్షణ ఉందని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న పరిజ్ఞానాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కగా బోధించడం వల్ల ఉన్నతవిద్యలో తోడ్పాటు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎంఎస్ చల్వాయి ప్రిన్సిపాల్ కుమార్, ఏఎంవో బి.శ్యాంసుందర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా కోఆర్డినేటర్‌లు అర్షం రాజు, సాంబయ్య, ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ పీర్ల కృష్ణబాబు, డీఆర్పీ డి.వెంకటేశ్వర్లు, ఆర్పీలు లక్ష్మణ్, యూసుఫ్,సుమన్, నరేందర్, జయశ్రీ, బి.కుమార్ రాథోడ, శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత ప్రచారాన్ని అడ్డుకున్న స్థానికులు

ఏటూరునాగారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం క్రైస్తవ మత ప్రచారాన్ని స్థానిక ప్రజలు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్త చోటుచేసుకుంది. కొంతమంది ఇంటింటికీ తిరుగుతూ మత ప్రచారానికి సంబంధించిన కరపత్రాలను పంచతుండగా, ఈ విషయం స్థానిక విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్ దళ్, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు తెలిసింది. వెంటనే వారు అక్కడికి చేరుకుని మత ప్రచారం చేస్తున్న వారిని అడ్డుకున్నారు. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో, మత ప్రచారం చేస్తున్న వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోసారి ఇలాంటి మత ప్రచార ఘటనలు పునరావృతమైతే ఉపేక్షించేది లేదని వీహెచ్‌పీ, బజరంగ్ దళ్, బీజేపీ కార్యకర్తలు హెచ్చరించారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6850	6300
మక్కలు	1870	1521
కందులు	6063	3022
పెసళ్లు	5156	3022
పల్లికాయ (సూక)	6630	3500
పల్లికాయ (పచ్చిది)	6200	3890
పసుపు (కాడి)	7779	6765
పసుపు (గోల)	11099	9987
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	15000	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	19000	12000
యూఎస్341ఏసీ	18000	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

పథకం పడావు



అటకెక్కిన పశుగ్రాసం పెంపకం

- ఒక్క లబ్ధిదారుడికి కూడా అందని సబ్సిడీ
- ట్రెజరీ అధికారుల తీరుతో నీరుగారిన లక్ష్యం
- బిల్లులు ఉంటేనే విడుదలంటూ మెలిక
- మురిగిపోయిన రూ. 4 కోట్ల నిధులు

హనుమకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణకు రైతులు పడావు భూముల్లో పశుగ్రాసం పెంచుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకం.. రెవెన్యూ, ట్రెజరీ అధికారుల తీరు వల్ల అమలుకు నోచుకోవడం లేదు. నాలుగేళ్ల కిందట అమలులోకి వచ్చిన ఈ పథకం కోసం కేంద్రం నిధులు ఇస్తున్నా అమలు కావడం లేదు. ఇతర జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్నా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికారుల మధ్య సమన్వలోపంతో పడావుపడుతోంది. దీంతో రైతులు పశుగ్రాసం కొరతతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

పశుగ్రాసం కొరత

ఆరుగాలం రైతులకు వ్యవసాయంలో తోడ్పడే కాడెద్దులకు మేత కరవవుతోంది. ఇంటా, బయట పశుగ్రాసం దొరక్క మూగజీవాలు అంబా అంటున్నాయి. కాడెద్దులకు పశుగ్రాసం దొరకకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కొందరు ఆర్థిక భారమైన వేలకు వేలు ఖర్చుపెట్టి గడ్డిని కొని పశువులను సాకుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పశువులకు సంపదకు సరిపడా పశుగ్రాసం దొరకడం లేదు. ఉన్న కొద్దిపాటి మేత ప్రియమైంది. గతంలో సాగునీరు అందుబాటులో లేక ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల భూములు పడావు పడి ఉండేవి. అక్కడ గడ్డి విస్తారంగా పెరిగేది. పశువులకు కావలసినంత మేత లభించేది. పశువులతో పాటు గొర్రెలు, మేకలకు సైతం గడ్డి దొరికేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. సాగునీరు అందుబాటులోకి వచ్చిన తర్వాత సాగునీరు పుష్కలంగా అందుబాటులో వచ్చింది. దీంతో క్రమంగా పడావు భూములు సైతం పచ్చని పొలాలుగా మారిపోయాయి. దీనితో పశువులకు మేయడానికి పచ్చగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ అధికారులు కూడా పడావు భూములు చూపలేకపోతున్నారు.

మురిగిపోయిన నిధులు

పథకం లక్ష్యం బాగానే ఉంది కానీ.. ఎటొచ్చి అమలులోనే చిక్కులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలకు ఈ పథకం కింద గతంలో రూ.4కోట్లు మంజూరయ్యాయి. నిధులు కూడా విడుదలయ్యాయి. లబ్ధిదారులను ఎంపిక చేసే ముందు పడావు భూములు ఎక్కడెక్కడ.. ఎంత విస్తీర్ణంలో ఉందో తెలుసుకోవడమే కాకుండా పశుగ్రాసం పెంచడానికి ఆ నేలలు ఎంత మేరకు అనువైనవో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు నిర్ధారించుకోవలసి ఉంటుంది. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారులకు లేఖలు రాశారు. హనుమకొండ జిల్లాలో అసలు పడావు భూములు లేవనే సమాధానం అధికారుల నుంచి వచ్చింది. దీనితో ఈ జిల్లాలో ఈ జిల్లాలో పథకం అమలే కాలేదు.

ట్రెజరీల మెలిక

మిగతా వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ పథకం అమలుకు ప్రయత్నా లు చేశారు. కానీ లబ్ధిదారులు ముందు గా తమ సొంత ఖర్చుతో పశుగ్రాసం చేపట్టి బిల్లులు పెట్టిన తర్వాతనే బిల్లులు పాస్ చేస్తామని ట్రెజరీ అధికారులు మెలికపెట్టడంతో పశుసంవర్ధక శాఖ అధికారు లు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. పడావు భూముల్లో ఒక హెక్టారులో పశుగ్రాసం పెంచుకోవడానికి ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో రూ.లక్ష ఇస్తుంది. పశుగ్రాసం పెంచడానికి చాలామంది ముందుకు వచ్చినా ఖర్చు పెట్టిన తర్వాతే బిల్లులు అనే సరికి వెనక్కితగ్గారు. సాధారణంగా ఏ పథకం కింద అయినా నిధులు మంజూరైతే సంబంధిత శాఖ అధికారుల ఖాతాల్లో అవి జమ కావాలి. అపుడు తమ వద్ద అందుబాటులో ఉన్న నిధులను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి మంజూరు ఇస్తారు. కానీ ఇక్కడ ట్రెజరీ అధికారులు బిల్లులు పెడితేనే నిధులను విడుదల చేస్తామనే సరికి పథకం అమలుకాక లక్ష్యం నీరుగారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగేళ్లుగా ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో పడావు భూమిలో గడ్డిని పెంచేందుకు ఆసక్తి ఉన్నవారు ముందుకు వచ్చిన ప్రయోజనం లేకుండా పోయింది.

అటకెక్కిన పథకం

పడావు భూముల్లో పశుగ్రాసం పారదర్శకంగా పెంచేందుకు పరిరక్షణకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలి. కానీ అసలు పథకమే అమలు కాకపోవడంతో ఈ కమిటీల ఏర్పాటు కూడా జరగలేదు.

ఈ యేడు కూడా ఇప్పటి వరకు పథకం అమలుకు సంబంధించిన రీవాలిడేషన్ రాకపోవడం వల్ల అమలు అవకాశాలు కనిపించడం లేదు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిధుల విడుదల విషయంలో చేసిన కొన్ని మార్పుల వల్ల భవిష్యత్తులో ఈ పథకం అమలులో ఇబ్బందులు తొలగవచ్చునని తెలుస్తోంది. భవిష్యత్తులో ఆయా పథకాల కింద లబ్ధిదారులకు సబ్సిడీని నేరుగా పీఎఫ్ఎంఎస్ విధానంలో నేరుగా వారి ఖాతాలోనే జమ చేయాలని నిర్ణయం తీసుకోవడం వల్ల ట్రెజరీ అడ్డంకులు ఉండకపోవచ్చునని తెలుస్తోంది.

పథకం ఇలా..

పడావు భూముల అభివృద్ధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం వంద శాతం రాయితీ అందిస్తోంది. మూడేళ్లపాటు నిరంతరాయంగా గ్రాసం అందేలా విత్తనం ఎంపిక చేసుకోవాలి. ధాన్యపు జాతి, పప్పుజాతి, గడ్డి జాతి పశుగ్రాసాలతో పాటు లూసర్న్, అవిశ, గంగరావి వంటి మొక్కలు నాటు కోవచ్చు. గుర్తించిన భూమిలో నీటి లభ్యత లేనట్లయితే బోరు వేసుకోవాలి. పెంచుతున్న గ్రాసాన్ని సంరక్షించుకునేందుకు చుట్టూ బయోఫెన్సింగ్ వేసుకోవాలి. లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీలు 15శాతం, ఎస్టీలు 8శాతం మందికి అవకాశం కల్పిస్తారు.

రూ.లక్ష సబ్సిడీ



పశువులకు గ్రాసం కొరత రాకుండా భవిష్యత్తులో మేతను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో కేంద్రం పడావు భూముల్లో పశుగ్రాసం పెంపకానికి ప్రత్యేక పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. గ్రామాల్లో పడావు భూములను అభివృద్ధి చేసుకొని కావలసిన గ్రాసం పెంచుకునేందుకు రైతులకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 400 యూనిట్లు మంజూరు అయ్యాయి. అవసరమైన రాయితీని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసి ఇస్తారు. పశువులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో జీవాలు పెద్ద సంఖ్యలో ఉంటే ఆహారం సరిపోక వలసలు వెళ్లాల్సి వస్తోంది. ఈ పథకం ద్వారా దీనిని నివారించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పడావు భూములు సుమారు 42 వేల ఎకరాల వరకు ఉంటాయని అధికారుల అంచనా. ఇటీవల నీటి వనరులు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత వీటితో పాటు గుట్టలు, రాళ్లు, రప్పలు ఉన్నచోట కూడా సాగులోకి తెస్తున్నారు. ఒక దశలో పశువులు మేత కోసం సంచరించేందుకు ఖాళీ స్థలాలు లేకుండా పోయాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని పడావు భూముల్లో గ్రాసం పెంచినట్లయితే ఈ పథకం ద్వారా పశువులకు ప్రయోజనం చేకూరుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

సెంట్రల్‌జైలు నిర్మాణం ఏదీ!?

- పాత భవన సముదాయం కూల్చివేసి నాలుగున్నరేళ్లు
- పట్టించుకోని పాలకులు



వరంగల్ సెంట్రల్ జైలు పాత చిత్రం.. (ఫైల్)

మామునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేరుగాంచిన వరంగల్ సెంట్రల్ జైలు కనుమరుగై నాలుగున్నరేళ్లు అవుతోంది. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం రాజులు నిర్మించిన ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, నిజాం రాజులకు వ్యతిరేకంగా పనిచేసిన వారు, తెలంగాణ ఉద్యమకారులు, మావోయిస్టు అగ్రనేతలు లాంటివారెందరో ఇందులో శిక్ష అనుభవించారు. ఎంతో మంది ఖైదీలకు జీవిత పాఠాలు నేర్పిన ఘనమైన చరిత్ర ఈ కారాగారానికి ఉంది. 1886లో నిజాంలు నిర్మించిన ఈ భవనాన్ని సూపర్ స్పెషాలిటీ నిర్మాణం కోసం 2021 జూన్‌లో కూల్చివేశారు. మొత్తం 66 ఎకరాల్లో విస్తీర్ణంలో పరిపాలన భవనం, ఖైదీల బ్యారక్‌లు, హైసెక్యూరిటీ బ్యారక్‌లు, ఖైదీల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన కర్మాగారాలు ఉండేవి. ఆ తర్వాత మామునూరులో అత్యాధునిక హంగులతో నూతన సెంట్రల్ జైలును రెండేళ్లలో నిర్మిస్తామని చెప్పింది. జైల్లో ఉన్న దాదాపు వెయ్యి మంది ఖైదీలను ఇతర జైళ్లకు తరలించింది. కాని భవనాన్ని నిర్మించలేదు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. పాత సెంట్రల్ జైలు భవనంలో ఉన్న ఖైదీలను వారి కుటుంబ సభ్యులు అప్పుడో ఇప్పుడో కలుసుకునేవారు. ఇప్పుడు వారు దూర ప్రాంతాల్లో ఉండడంతో అక్కడికి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఇప్పటికైనా వరంగల్ సెంట్రల్ జైలు నిర్మించాలని ఖైదీల కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

20 మంది ఖైదీలకు 40 మంది సిబ్బంది..

వరంగల్ మామునూరులో సెంట్రల్ జైలు నిర్మాణం కోసం (టీఎస్ఎస్‌పీ) 4వ బెటాలియన్ క్యాంపస్ పక్కన 101 ఎకరాల స్థలం కేటాయించినప్పటికీ నిర్మాణం కోసం ఎలాంటి బడ్జెట్ కేటాయించనట్లు తెలుస్తోంది. పైగా 20 మంది ఖైదీలకు 40మంది పోలీసులు పనిచేస్తున్నారు. మామునూరులో 20 మంది ఖైదీలు ఉండగా 40మంది ..ఒక డీఎస్పీ, ఒక జైలర్, ఒక డిప్యూటీ జైలర్ ఇంకా సీనియర్ పోలీసులు ఇక్కడ పనిచేస్తున్నట్లు తెలిసింది.

మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారం

- నిందితుడు 70 ఏళ్ల వృద్ధుడు
- బాధితురాలికి వరుసకు పెదనాన్న
- ములుగు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసిన దారుణం

వెంకటాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అతడు 70 ఏళ్ల వృద్ధుడు.. కానీ కామంతో కళ్లు కుమూసుకు పోవడంతో వావి వరుసలు మరిచాడు. వరుసకు కూతురు అయ్యేమతిస్థిమితం లేని 15 ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన ములుగు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు ఊరూరు తిరుగుతూ వంట సామగ్రి విక్రయిస్తుంటారు. వీరికి 15 ఏళ్ల కూతురు ఉంది. ఈమెకు మతిస్థిమితం లేకపోవడంతో ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామంలో 15 రోజుల క్రితం వరుసకు పెదనాన్న అయ్యే 70 ఏళ్ల వృద్ధుడు ఒంటరిగా వున్న బాలికపై అత్యాచారం జరిపాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలుపడంతో కులపెద్దలు పంచాయితీ పెట్టారు. చివరకు రూ.6 లక్షలు బాధిత బాలిక కుటుంబానికి ఇవ్వాలని, మరో రూ.2లక్షలు కులసంఘ పెద్దలకు ఇవ్వాలని తీర్మానించారు. ఇందుకు అత్యాచారానికి పాల్పడినవృద్ధుడు కూడా అంగీకరించినట్లు తెలిసింది. అయితే ఒప్పుకున్నవిధంగా వృద్ధుడు బాలిక కుటుంబానికి రూ.6లక్షలు, పెద్దమనుషులకు రూ.2లక్షలు ఇవ్వకపోవడంతో విషయం బయటకు పొక్కింది. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు శుక్రవారం వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

యునెస్కో సదస్సుకు రోహిణి

డిసెంబర్12 నుంచి 15వరకు హాంకాంగ్‌లో సదస్సు



కరీమాబాద్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యునెస్కో సదస్సుకు వరంగల్ పెరుకవాడకు చెందిన రంగరాజు రోహిణి ఎంపికైంది. ఆమె ప్రస్తుతం హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. వెనుకబడిన వర్గానికి చెందిన రోహిణి అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 4వ అంతర్జాతీయ యునెస్కో మోడల్ ఎథిక్స్ ఆఫ్ న్యూరో టెక్నాలజీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సదస్సు డిసెంబర్ 12 నుంచి 15వరకు హాంకాంగ్‌లో జరగనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతుల ఎంపికలో మన దేశం నుంచి రోహిణికి స్థానం లభించడం విశేషం. ఈ సందర్భంగా యునెస్కో తెలంగాణ స్టేట్ చాప్టర్ కో-ఆర్డినేటర్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు రోహిణికి అభినందనలు తెలిపారు. అయితే అమెకు హాంకాంగ్ వెళ్లడానికి అవసరమైన ప్రయాణ ఖర్చులు భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

అంతా డొల్ల..!

- అధ్వానంగా అమృత్‌భారత్ పనులు
- యేడాదిలోపే ప్లాట్‌ఫారాలపై పగుళ్లు..
- పనిచేయని లిఫ్ట్‌లు.. కుంగుతున్న ఫ్లోర్
- మూణ్నాళ్ల ముచ్చటగా ఆధునిక సౌకర్యాలు
- అధ్వానంగా వరంగల్ రైల్వే స్టేషన్





నాలుగో ప్లాట్‌ఫామ్‌పై నూతన లిఫ్ట్ ముందు పగుళ్లు ఏర్పడిన దృశ్యం

గిర్మాజిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సౌకర్యాలు.. అత్యాధునిక హంగులు.. ఎయిర్‌పోర్ట్‌ను తలపించేలా నిర్మాణం.. అమృత్ భారత్ పథకం కింద కోట్ల రుపాయలతో వరంగల్ రైల్వే స్టేషన్‌ను తీర్చిదిద్దారు. అద్భుతం అనిపించారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా అట్టహాసంగా ప్రారంభించారు. ఇంతవరకు బాగేదే ఉంది.కాని.. ప్రారంభించిన మూణ్నాళ్లకే పనుల్లో డొల్లతనం బయటపడింది. ప్లాట్‌ఫారాలపై పగుళ్లు ఏర్పడ్డాయి. లిఫ్ట్‌లు సరిగా పనిచేయడం లేదు.

తొలుత రూ.28 కోట్లతో..

వరంగల్ చారిత్రక, పర్యాటక ప్రాంత ప్రాముఖ్యతను గుర్తించిన రైల్వేశాఖ తొలుత పర్యాటక ప్రాంతాల రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి పథకం కింద రూ.18 కోట్లు కేటాయించింది. వీటితో ప్లాట్‌ఫారాలు, విశ్రాంతిమందిరాలు, వరంగల్, శివనగర్ వైపు స్టేషన్ భవనాలను అభివృద్ధి చేశారు. కాకతీయ చారిత్రక కళావైభవం ఉట్టిపడేలా వరంగల్ వైపు భవనాన్ని సుందరీకరించారు. స్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలపై పాత ఫ్లోరింగ్‌ను పూర్తిగా తొలగించి కొత్తగా వేశారు. అలాగే విశ్రాంతి మందిరాలలోని ఫ్లోర్, ఫర్నిచర్, ఫ్యానులు కొత్తవి ఏర్పాటు చేశారు.

తర్వాత రూ.25 కోట్లు..

అనంతరం అమృత్ భారత్ పథకం కింద మరో రూ.25 కోట్లతో వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఎయిర్ పోర్ట్ తరహాలో సకల సదుపాయాలతో అభివృద్ధి చేశారు. సుమారు రెండు సంవత్సరాల పాటు పనులు చేశారు. ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లు, భారీ ర్యాంపులు, భారీ వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, అధునాతనంగా ఉచిత, ప్రిపెయిడ్ ఎసీ విశ్రాంతి మందిరాలు, నాలుగు ప్లాట్‌ఫారాల ఫ్లోరింగ్, రైల్వేస్టేషన్ యావత్తు విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రత్యక్షంగా ప్రారంభించారు. తీరా 9 నెలలు గడవక ముందే ప్లాట్‌ఫారాలపై పగుళ్లు వచ్చాయి. నాలుగో ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన భారీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటుచేసిన నూతన లిఫ్ట్ చుట్టూరా పగుళ్లు ఏర్పడ్డాయి. గ్రానైట్ రాళ్లు విరిగి కుంగిపోయి గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు ముఖ్యంగా వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. మొదటి ప్లాట్‌ఫాంపై కూడా ఇదే పరిస్థితి ఉంది. జీఆర్‌పీ స్టేషన్ ముందు ప్లాట్‌ఫాంపై పెద్ద గుంత పడడంతో అంతా కుంగినట్లు కనిపిస్తున్నది. మరోవైపు లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఎస్కలేటర్లు అంటే భయపడే వృద్ధులు మెట్లు ఎక్కలేక నరకం చూస్తున్నారు. అయినప్పటికీ స్థానిక రైల్వే ఇంజనీరింగ్ అధికారులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు వరంగల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించి విచారణ చేపట్టాలని, వెంటనే తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సహకార స్ఫూర్తికి రాజకీయ చీడ

- ప్రాభవం కోల్పోతున్న ఖానాపురం సొసైటీ
- ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే ఉత్తమ సంఘంగా గుర్తింపు
- కోర్టు పలుమార్లు మొట్టికాయలు వేసినా మారని తీరు
- మూడోసారి కొలువుదీరిన సొసైటీ పాలకవర్గం



బాధ్యతలు చేపడుతున్న సొసైటీ పాలకవర్గం

ఖానాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఆధిపత్య క్రీడలో ఖానాపురం సొసైటీ ప్రతిష్ట మసకబారుతున్నది. వరుస కోర్టు వివాదాలతో రైతులకు సక్రమంగా సేవలు అందించలేక పోతోంది. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే ఉత్తమ సహకార సంఘంగా నిలిచి పలు అవార్డులను సొంతం చేసుకున్న ఈ సొసైటీ రాజకీయ జోక్యంతో అస్తవ్యస్తంగా మారుతోంది. 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. వీటి పాలకవర్గాల పదవి కాలం 2025 ఫిబ్రవరి 14తో ముగిసింది. దీంతో వెంటనే మళ్లీ ఎన్నికలు నిర్వహించలేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సొసైటీ పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఖానాపురం సొసైటీ పాలకవర్గం పదవీ కాలాన్ని మాత్రం ప్రభుత్వం పొడిగించలేదు.

పీఏసీగా సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజా రవికిరణ్‌కు బాధ్యతలు అప్పగించింది. దీంతో సొసైటీ పాలకవర్గ సభ్యులు కోర్టుకు వెళ్లారు. కోర్టు పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని తీర్పునివ్వడంతో 2025 మార్చి 1న తిరిగి పాలకవర్గం రెండోసారి కొలువుదీరింది. మళ్లీ ప్రభుత్వం 2025 మే 26న పాలకవర్గాన్ని రద్దుచేస్తూ పీఏసీగా సహకార శాఖకే చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈగ వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించింది. దీంతో మరోమారు సొసైటీ పాలకవర్గం హైకోర్టుకు వెళ్లారు. ఈ నెల 19న హైకోర్టు పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని తీర్పునిచ్చింది. దీంతో శుక్రవారం ముచ్చటగా మూడోసారి ఛైర్మన్ రామస్వామినాయక్‌తో పాటు 13 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గం కొలువుదీరింది.

సేవలలో జాప్యం..

సొసైటీ పాలకవర్గం రద్దవుతూ కొనసాగుతున్న తరుణంలో సొసైటీ పరిధిలోని రైతులకు సేవలు అందించడంలో జాప్యం జరుగుతున్నది. పాలకవర్గం ఉన్న సమయంలో ప్రధానంగా సీజన్‌కు ముందే పెద్దఎత్తున ఎరువులను (బఫర్‌స్టాక్ కింద) కొనుగోలు చేసుకుని గోదాములలో నిల్వ ఉంచేవారు. దీంతో రైతులకు యూరియా ఇబ్బందులు తలెత్తేవికావు. ఈ వానాకాలం సీజన్‌లో పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ముందస్తుగా ఎరువులను కొనుగోలు చేయకపోవ డం మూలంగా యూరియా దొరకక పాకాల ఆయకట్టు రైతులు చాలా అవస్థలు పడాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో సొసైటీ ఆధ్వర్యంలోనే ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరిగేవి. దీంతో సొసైటీకి ప్రతి సీజన్‌కు లక్షల రుపాయాల లాభం చేకూరేది. కానీ గత కొద్ది సంవత్సరాలుగా రాజకీయాలు పెరిగి రాజకీయ నాయకులు సూచించిన వారికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరవుతుండడంతో సొసైటీ కొనుగోళ్లు తగ్గుతున్నాయి. తద్వారా లాభాలు సైతం తగ్గుతున్నాయి.

పాలకవర్గంతో ఆటలాడుకోవద్దు...

నీతి నిజాయితీగా పనిచేసి సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన పాలకవర్గంతో ప్రభుత్వం ఆటలాడుకోవడం మంచిదికాదు. పాలకర్గాన్ని అన్యాయంగా రద్దు చేసిన ప్రతి సందర్భంలో కోర్టులు ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూనే ఉన్నాయి. ప్రతిపక్షం అనే కోణంలో చూసి ప్రభుత్వం పాలకవర్గాన్ని ఇబ్బందులకు గురిచేయడం మంచి సంస్కృతి కాదు. గతంలో పాలకవర్గాల గడువు ముగిసినపుడు ప్రభుత్వాలు ఇలా కక్షపూరితంగా వ్యవహరించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పాలకవర్గానికి సహకరించాలి.

గుగులోత్ రామస్వామినాయక్, సొసైటీ ఛైర్మన్

అంచనాల పెంపులో అక్రమాల కంపు

(5వ పేజీ తరువాయి)

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన చేసింది. 56ఎకరాల్లో సూపర్‌స్పెషాలిటీ అస్పత్రితో పాటు ఎంజీఎం అస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అన్ని కూడా ఒకే కాంప్లెక్స్ పరిధిలోకి తెచ్చేలా వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి 2021లో రూ.1,116 కోట్లు కేటాయిస్తూ అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ జీవో నెంబరు 158 విడుదల చేశారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ అస్పత్రి పనులను చేపట్టింది. అయితే ఏడాదికాకముందే ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1,725.95 కోట్లకు గత ప్రభుత్వం పెంచింది. అదనంగా రూ.625.95 కోట్ల వ్యయాన్ని పెంచడాన్ని గోప్యంగా ఉంచింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎలాంటి అదనపు అంచనాలు లేకుండా రూ.1,725.95 కోట్లకు పెంచడంపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టింది. గత ఏడాది జూన్ 29వ తేదీన స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించి, అంచనాల పెంపుపై అనుమానాలు రావటంతో ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అన్ని కోణాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ బృందం పరిశీలిన చేసిన అనంతరం సుమారు రూ.600 కోట్ల అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా పెంచినట్లుగా నిర్ధారించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి ఫోరెన్సిక్ ఆడిట్ బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

మరోవైపు తెలంగాణ స్టేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్)ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు వరంగల్ సెంట్రల్ జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759గజాల స్థలాన్ని (56ఎకరాలు)బదిలీ చేస్తూ జీవో నెం.81ని జారీ చేసింది. టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి సూపర్ స్పెషాలిటీ అస్పత్రి కోసం బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర, హైదరాబాద్ నుంచి రూ.1,173 కోట్ల రుణం తీసుకుంది. అయితే ఈ మొత్తాన్ని అస్పత్రి నిర్మాణానికి ఖర్చు చేయకుండా, ఇతర వాటికి మళ్లించారు.

జైలు భూమిని తాకట్టు పెట్టడం ఏమిటని.. తీసుకున్న రుణాన్ని అస్పత్రికి కాకుండా ఇతర వాటికి మళ్లించటం ఏమిటని గత ప్రభుత్వ విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తప్పు పట్టారు. దీనిపై గత ఏడాది ఆగస్టు 30వ తేదీన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ శాఖతో విచారణకు ఆదేశించారు. దీంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. అస్పత్రి నిర్మాణంలో భాగస్వామ్యం ఉన్న ఇంజనీర్లు, కాంట్రాక్టు కంపెనీతోపాటు పలువురు ప్రభుత్వ వైద్యులను కూడా విజిలెన్స్ అధికారులు విచారించారు. ఫోరెనిక్స్ ఆడిట్ రిపోర్టు పూర్తయినప్పటికీ విజిలెన్స్ నివేదిక అందిన తరువాతే అంచనాల పెంపునకు సహకరించిన పలువురు వైద్యులు, ప్రొఫెసర్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మార్చిలోగా సేవలు అందేనా..?

సూపర్ స్పెషాలిటీ అస్పత్రిని మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత ప్రభుత్వం పెంచిన అంచనా వ్యయం రూ.1,725.95 కోట్లపై ఆడిట్ చేసింది. అధికారులతో పలు మార్లు సమీక్షల అనంతరం రూ.1,558 కోట్లకు అంచనా వ్యయాన్ని కుదించింది. వీటిలో సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్, పారిశుధ్య పనుల కోసం రూ.1159.77 కోట్లు కేటాయించారు. అలాగే వైద్య పరికరాలు, అనుబంధ పనుల కోసం రూ.10.71 కోట్లు, నిర్మాణాలు, పర్యావరణం, డిజైన్, ఎన్‌వోసీలు తదితర చట్టబద్ధమైన అనుమతుల కోసం రూ.4.47 కోట్లు కేటాయించారు. అలాగే అస్పతి భవన నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ శాఖకు రూ. 1.83 కోట్లు, జీఎస్టీలతోపాటు ఇతర పన్నుల కోసం రూ.22.80 కోట్లు కేటాయించారు. రూ.1,558 కోట్లతో అస్పత్రిని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2022-23లో కంటే ప్రస్తుతం నిర్మాణ వ్యయం భారీగా పెరిగినప్పటికీ అంచనా వ్యయాన్ని రూ.167.95 కోట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం తగ్గించింది. ఇప్పటివరకు 85 శాతం పైగా పనులు పూర్తయ్యాయని, అస్పత్రిలో ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాల్ కూడా చేపడుతున్నారు. నిధుల కొరత కూడా లేకపోవటంతో మార్చిలోపు పనులు పూర్తిచేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సూపర్ సేవలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఉన్నారు.

అక్రమాలపై రాజకీయం

సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణం, అంచనాల పెంపుపై రాజకీయ విమర్శలు పేలుతున్నాయి. గత ప్రభుత్వం పేదల అస్పత్రి పేరుతో సుమారు రూ.600 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపిస్తే.. తామే 85శాతం పనులు పూర్తి చేశామని, మిగతా పనులు కూడా పూర్తి చేసే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఇటీవల అస్పత్రిని పరిశీలించిన మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు.

అయితే అస్పత్రి అంచనాలను పెంచి హరీష్‌రావుకు సంబంధించిన బినామీ కంపెనీకి కేటాయించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలు రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఫోరెనిక్స్ ఆడిట్ రిపోర్టుతో పాటు విజిలెన్స్ నివేదికను విడుదల చేస్తే.. పేదల అస్పత్రికి కేటాయించిన సొమ్ముతో పాటు జైలును తాకట్టు పెట్టి తెచ్చిన నిధులు ఎవరి ఖాతాలోకి వెళ్లాయనేది వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగాలి

విద్యార్థులకు సూచనలు చేసిన జనవిజ్ఞానవేదిక బాధ్యులు


ములుగులో ప్రశంస పత్రాలు అందజేస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు


ప్రశంస పత్రాలతో మహదేవపూర్ పాఠశాల విద్యార్థులు


చిట్యాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల విజేతలతో తహసీల్దార్, ఎస్సై

ములుగు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మారుతున్న ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగాలని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఆదిరెడ్డి అన్నారు. శుక్రవారం జేవీవీ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులలో మూఢ నమ్మకాలను విస్మరింపజేసి సైంటిఫిక్ టెంపర్‌ను డెవలప్ చేసేందుకు మండల స్థాయి చెకుముకి సైన్స్ టెస్ట్‌ను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎండీ ఖలీల్, ఉపాధ్యాయులు, జేవీవీ నాయకులు రత్నం ప్రవీణ్, చంటి పాల్గొన్నారు.

● వాజేడు : విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానంపై అధ్యయనం చేయాలని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహైస్కూ ల్‌లో సమగ్ర శిక్ష తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జన విజ్ఞాన వేదికల ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్సు సంబ రాలను నిర్వహించారు. జడ్పీహైస్కూల్ వాజేడు, ఏహెచ్ఎస్ పేరూరు, ఏజీహెచ్ఎస్ శ్రీరాంనగర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అక్షిత, మ హేష్, రాణాప్రతాప్, దుర్గాశ్రీ, ఉదయకుమార్, సాత్విక్, జ్యోశ్నవి, తన్మ య అనే విద్యార్థులు ప్రతిభ కనపర్చడంతో వారికి ఎంఈవో ప్రశ ంసా పత్రాలను అందజేశారు. హెచ్ఎంలు ఆనందరావు పాల్గొన్నారు.

●గోవిందరావుపేట : మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ కొర్ర రఘురాం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి సైన్స్ పోటీలు జరిగాయి. ఈ టెస్టులో మండలంలోని పది హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొనగా మొదటి స్థానంలో మెరిట్ హైస్కూల్, రెండోస్థానంలో చల్వాయి జడ్పీహెచ్ఎస్, మూడో స్థానంలో ఏహెచ్ఎస్ కర్లపల్లి పాఠశా లలు నిలిచాయి.

●కాటారం :మండలకేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం చెకుముకి సంబరాల్లో భాగంగా మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సోమలింగం ఆధ్వర్యంలో మండల కన్వీనర్ టెస్ట్‌ను నిర్వహించారు. మండల స్థాయిలో వివిధ పాఠశాల విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి కాటారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం సోమలింగం తెలిపారు.

● చిట్యాల : విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తహసీల్దార్ ఇమామ్‌బాబా షేక్ అన్నారు. భుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్‌టెస్టు విజేతలకు బహుమతులు అందజేశారు. చిట్యాల ఎస్సై-2 హేమలత మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో చల్లగరిగ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, జూకల్లు ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలవగా గురుకులాల విభాగంలో సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల ప్రథమ, మోడల్ స్కూల్ ద్వితీయ స్థానం, ప్రైవేటు పాఠశాలల విభాగంలో ఒడితల వివేకానంద ప్రథమ, చిట్యాల కాకతీయ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి.

● మహదేవపూర్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుమకి టాలెంట్ టెస్ట్ శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బిప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీ స్కూల్ కేటగిరిలో మొదటి స్థానం కాళేశ్వరం పాఠశాల, రెసిడె న్షియల్ స్కూల్ కేటగిరిలో కేజీబీవీ మహదేవపూర్ మొదటి స్థానం, టీజీటీఏఎస్ కాళేశ్వరం రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మహదేవపూర్ మండల విద్యాధికారి ప్రకాష్, బాబు, స్కూల్ కాంప్లెక్స్ మహదేవపూర్ బాలుర ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

● మంగపేట : విద్యార్థులలో సృజనాత్మకతను శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్ టాలెంట్ టెస్టులు సోపనాలుగా ఉపయోగపడుతాయని జన విజ్ఞాన వేది మండల కన్వీనర్ గడ్డం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కమలాపురం జడ్పీ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్టులను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ గడ్డం శ్రీనివాస్, కమలాపురం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కొక్కుల నాగలక్ష్మీ, ఉపాధ్యాయులు గొప్ప సమ్మారావు, నరేష్, నాగభూషణం, రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై కళాజాత

చిట్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు బాల్యవివాహాలు నిర్మూలనపై శుక్రవారం సాంస్కృతిక సారథి బృందం కళాజాత నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో బాల్య వివాహాల నిర్మూలన, బాధ్యతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నీలం రవీందర్, ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద, కళాకారులు ఎర్రన్న, దుప్పటి రవి, సాగర్, స్వప్న, శ్యామల, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

వెంకటాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కల్లెపు పైడి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతని బాల్యమిత్రులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. బాల్యమిత్రులు పుల్యాల రమేష్, శంకర్, అశోక్, ప్రసాద్, కుమార్, శ్రీనివాస్, ప్రేమ, విజయ, పాల్గొన్నారు.

కేటీపీపీ సీఈని కలిసిన నూతన కార్యవర్గం

గణపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌ను కేటీపీపీ ఎస్సీ, ఎస్టీ నూతన కార్యవర్గం శక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సీఈని కలిసిన వారిలో నూతన అధ్యక్షుడు చందన్‌సింగ్, వర్కింగ్ శంకర్, వైస్ ప్రెసిడెంట్ భూమయ్య, సురేష్, శ్రీనివాస్, మురళి, లక్ష్మణ్ ఉన్నారు.

కల్లుగీత కార్మిక సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

తాడ్వాయి, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా గౌరవ అధ్యక్షుడు పులి నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మిక రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మికులకు పిలుపునిస్తూ శుక్రవారం వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ నెల 28న జరిగే చలో సూర్యపేట రణభేరి బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో కల్లుగీత కార్మికులు తరలి రావలన్నారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా ఉపాధ్యాక్షుడు రంగు సత్యనారాయణ గౌడ్, తాడ్వాయి మండల అధ్యక్షుడు గందు సదయ్య గౌడ్, కార్యదర్శి తిర్రి సంపత్ గౌడ్, నాయకులు గడ్డం శ్రీధర్ గౌడ్, నరేష్, రవికిరణ్, రఘుబాబు, వీరస్వామి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ప్రారంభం

మొగుళ్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నూతన బ్రేకర్‌ను శుక్రవారం భూపాలపల్లి ఆపరేషన్ డీఈ పాపిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌టీ డీఈ సదానందం, ఏడీఈలు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ మహేష్, చిట్యాల ఏఈ వెంకటసంజయ్, తదితరులు పాల్గొన్నారు.

కాంస్య విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

మహదేవపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రంలో గత రెండు రోజుల క్రితం మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్రర్ విగ్రహాన్ని అధిక వేగంతో లారీ ఢీకొనడంతో విగ్రహం పూర్తిగా ధ్వంసమైంది. దీనిని అఖిలపక్ష బృందం పర్యటించి శుక్రవారం టీజీ ఎండీసీ పీవోను కలిశారు. అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాలు, మైనార్టీ సంఘం, ఎస్సీ సంఘాల నాయకులు సముద్రాల తిరుపతి, గడ్డం స్వామి, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్‌ఖాన్, దళిత ఐసగ నాయకులు బెల్లంపల్లి సురేష్, నల్లబుగ్గ ధర్మయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలనిజిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు శుక్రవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రం సతీష్‌కుమార్, కార్యదర్శి గుజ్జ సారేశ్వర్‌రావు మాట్లాడుతూ జీవో 239 ద్వారా ప్రభుత్వ గుర్తింపుపొందిన ఫెడరేషన్, సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, రిటైర్డ్ జర్నలిస్టులకు ఫించన్లు, మహిళా జర్నలిస్టులకు రాత్రిపూట రవాణా సౌకర్యం తదితర సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు చింతల కుమార్‌యాదవ్, గాదె రమేష్, రొంటాల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ములకల లక్ష్మారెడ్డి, కోశాధికారి మండల రాంబాబు, నాయకులు దుర్గయ్య, ప్రవీణ్‌కుమార్, భాస్కర్, సృజన్, రమేష్, రహీంపాషా, జోవర్ధన్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

ఏటూరునాగారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలో మరిరాజుల సంఘం ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి చిమటర రఘు జెండాను బస్టాండ్‌లో ఆవిష్కరించారు. అనంతరం ముదిరాజ్‌లకు స్వీట్లు పంచుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ముదిరాజులు మత్స్యకారులు అనే నినాదంతో 2014, నవంబరు 21న తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నకిరబోయిన రమేష్, చింతకింది రాజు, గాడిచర్ల సాంబయ్య, బాస శరత్, గికురు లింగయ్య, గికురు అనిల్, గాడిచర్ల సత్యం పాల్గొన్నారు.

విద్యార్థినులకు మంచి భోజనం అందించాలి


ఆహారాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

వెంకటాపూర్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ గిరిబాబు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని రామాంజాపూర్ శివారులో గల చెంచుకాలనీలోని బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించడంతోపాటు విద్యార్థుల తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల పనితీరును తనిఖీ చేశారు. అనంతరం వంటశాలను సందర్శించి వండిన పదార్థాలను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ బొమ్మల రమేష్, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్ఎంఎస్ హాస్టల్ ఏర్పాటు చేయాలి

కాటారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):కాటారం డివిజన్ కేంద్రంలో దూరప్రాంతాల నుంచి వచ్చి వివిధ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్ఎంఎస్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐటీఐ, జూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. బాలురకు హాస్టల్ లేక జూనియర్ కళాశాల, ఐటీఐలో అడ్మిషన్లు క్రమేణా తగ్గిపోతున్నాయని ఆరోపించారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. స్థానిక మంత్రి శ్రీధర్‌బాబు దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ నాయకులు అఖిల్, రాజు, సందేశ్ తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


అన్నదానంలో పాల్గొన్న రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి సూర్య

ములుగు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గడిగడ్డలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రెడ్డిమళ్ళ సుభద్ర కుమారుడు నేతాజీ ఆధ్వర్యంలో సుభద్ర జ్ఞాపకార్థం 100 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య, ఎస్సై వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి గౌడ్‌లు హాజరయ్యారు. అనంతరం ఎస్సై వెంకటేశ్వర్లు వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. దొనికెల రామన్న, గడ్డమీది రమేష్, పాస్టర్ తాటి అశోక్, గాయకుడు విజయ్, శానబోయిన అశోక్, కవిత, రషీద్, సమ్మన్న, రహ్మద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వాజేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గతేడాది మావోయిస్టుల చేతిలో పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో హత్యకు గురైన అన్నదమ్ములు ఉయిక రమేష్, ఉయిక అర్జున్‌ల కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇద్దరు మృతిచెంది సంవత్సరం కావడంతో మంత్రి సీతక్క ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, టాస్ అండ్ ఉల్లాస్ కో-ఆర్డినేటరు పీర్ల కృష్ణబాబులు రమేష్ భార్య రాంబాయి, అర్జున్ భార్య సావిత్రిలను పరామర్శించారు. ఇరువురు కుటుంబాలకు రూ 25లక్షలు పరిహారాన్ని మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఒకరికి ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

వడ్లోని వాగుపై చెక్‌డ్యాం పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెక్ డ్యాం ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల కల సాకారం కానుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం కాశీంపల్లి సమీపంలోని వడ్లోని వాగుపై చెక్‌డ్యాం నిర్మాణం కోసం రూ.12కోట్లు మంజూరు కాగా ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్లోని వాగుపై చెక్‌డ్యాం నిర్మాణం చేయా లని కాశీంపల్లి, జంగేడు, సెగ్గంపల్లి తదితర గ్రామాల ప్రజలు కోరిన నేపథ్యంలో గత పాలకులు పదేళ్లు అధికారంలో ఉన్నా.. కనీసం పట్టించు కోలేదని అన్నారు. ఈ చెక్‌డ్యాం నిర్మాణంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. అలాగే కాశీంపల్లి చెరువును ట్యాంక్‌బండ్‌ల తయారుచేస్తామని తెలిపారు. స్లావత్ దేవన్, దాట్ల శ్రీనివాస్, కుమార్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న పుట్ట మధు

కాటారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కొత్తపల్లి, దామెర కుంట, ధర్మసాగర్ గ్రామాల్లో వివిధ కారణాలతో తోడె రాజిరెడ్డి, కాయిత చిలకమ్మ, జిల్లెల్ల బాపు, తోట ముత్తయ్య మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పుట్ట మధు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు జక్కు రాకేష్, వెంకటేశ్వర్‌రావు, నరివెద్ది శ్రీనివాస్, వెంకటస్వామి, సదువలి, శ్రావణ్, రాజబాపు, శ్రీలక్ష్మిచౌదరి, సంతోష్, విక్రమ్, సమ్మయ్య, రమణ, మనోహర్, తిరుపతి, దేవా, లక్ష్మయ్య, శంకర్, విఠల్ ఉన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

గోవిందరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో కాంటా పూర్తయిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని పస్రాలో గల మ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో రవాణా రిజిష్టర్ మెయింటెన్ చేయాలని సూచించారు. మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేదిలేదని అన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకు మనమంతా అండగా నిలబడి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

బీసీలు కలిసికట్టుగా ఉద్యమించాలి


సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్

వెంకటాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 42శాతం రిజర్వేషన్ కోసం ఏజెన్సీ ప్రాంత బీసీలు కలిసికట్టుగా ఉద్యమించాలని వాడబలిజ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ పిలుపునిచ్చారు. మండలంలోని మొర్రవానిగూడెంలో శుక్రవారం ఆయన వాడబలిజ సేవాసంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం అబ్బాయిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ నినాదం ఉవ్వెత్తున ఎగుస్తుందని, ప్రభుత్వాలు 42శాతం బీసీలకు కేటాయించి న్యాయం చేస్తామని చెప్పినప్పటికీ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 యాక్టు అమలులో ఉండడం వల్ల ఈప్రాంత బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. 42శాతం రిజర్వేషన్ అమలు కోసం ఈప్రాంత బీసీలు ఉద్యమించాలని, లేనట్లయితే అణగదొక్కే ప్రయత్నం జరుగుతుం దని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావు, వాజేడు మండల అధికార ప్రతినిధి బొల్లె ఆదినారాయణ, సీనియర్ నాయకులు అల్లి సూరిబాబు, తోట నాగేశ్వర్‌రావు, బద్రి ఆదినారాయణ, ప్రశాంత్, కోటేశ్వర్‌రావు, బొల్లె చంటి, రమేష్, దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం


వాజేడులో జెండావిష్కరణ చేస్తున్న నాయకులు


గణపురంలో జెండావిష్కరణ చేస్తున్న బోయిని సాంబయ్య

వాజేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని మత్స్యకారులు మండలంలో ఘనంగా నిర్వహించారు. వాడబలిజ సేవా సంఘం మండల అధికార ప్రతినిధి బొల్లె ఆదినా రాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మండలంలోని పేరూరు, చిన్న గొల్లగుడెం, రాంపురంలలో ఆ సంఘను జెండాను ఎగురువేశారు. ఆ సంఘ నాయకులు కుంట నరసింహ రావు, సంతోష్, ఆదినారాయణ, నరేష్, మహష్, శ్రీధర్, చంటి, బొల్లె నరేష్ పాల్గొన్నారు.

●భూపాలపల్లిటౌన్, ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ పరస్పర సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక మల్లయ్య జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిరాజ్ మహాసభ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు, పరపతి సంఘం నాయకులు పాల్గొన్నారు.

●మల్హర్ : మండలంలోని ఎడ్లపల్లిలో శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ను ఏగిరేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధా కార్యదర్శి అక్కినవేని అశోక్, అక్కినవేన సమ్మయ్య, దబ్బెట నగేష్, సుమన్, రమేష్, వీరయ్య, సురేష్, నాగరాజు, శ్రీనివాస్, మహేంధర్, మాంతయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

● గణపురం : ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్నిపురస్కరించుకుని మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడి బోయిని సాంబయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈసందర్భంగా జెండా ఎగరవేసి నినాదాలు చేశారు. మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ చాడ కృష్ణ స్వామి, మత్స్యసంఘం నాయకులు రాజ్‌కుమార్, తిరుపతి, జోడు ప్రదీప్, రవీందర్, రమేష్, గణేష్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

● తాడ్వాయి : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ సంఘాల నాయకులు, మత్స్యకారులు తాడ్వాయి మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ముదిరాజ్ మహాసభ ములుగు జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రంగరబోయిన జగన్, నాయకులు సాదు చక్రపాణి, బొల్లు నాగేంద్ర కుమార్, పిట్టల సారయ్య, రాజన్న, రాజు, మల్లేష్, చందు, కిరణ్ చందర్, సాంబయ్య, రాజయ్య, డేవిడ్, హరీష్, రాకేష్, రవి, గణేష్, ప్రవీణ్ కుమార్, అరుణ్, వరుణ్, శివమణి, సందీప్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశపడి.. గోసపడుతూ..


(5వ పేజీ తరువాయి)

రికవరీ చేసి ఇస్తుంది. కానీ ఆ బిల్లులు కూడా సక్రమంగా రావడం లేదని వాపోతున్నారు. అన్నింటికంటే ప్రధానమైన సమస్య ఉద్యోగుల విరమణ అనంతరం రావాల్సిన బెనిఫిట్స్ అందక మానసికంగా కుంగిపోయి కొంతమంది ఇప్పటికే మృత్యువాతపడిన వారు లేకపోలేదు. అయినప్పటికీ ప్రభుత్వాలకు కనికరం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉద్యోగి, ఉపాధ్యాయులు పదవి విరమణ పొందితే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేయాల్సిన ప్రభుత్వాలు నిస్సహాయ స్థితిని ఏర్పరచడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- చర్చలు జరిగినా.. దక్కని ఫలితం..

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని దశల వారీగా రాష్ట్రంలోని 268 ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా (జేఏసీ) ఏర్పడి పలుమార్లు హైదరాబాద్‌లో ఆందోళనలు చేయగా గత రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం చర్చల కు పిలిచింది. కానీ ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని పలు సంఘాల నాయకులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో ఇవ్వాల్సిన మెడికల్ రీయంబర్స్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం దారుణమని చెబుతున్నారు. ఉద్యోగ విరమణ చెందితే.. వెంటనే ఇవ్వాల్సిన బెనిఫిట్స్ సుమారు రూ.20లక్షల నుంచి రూ.50లక్షల వరకు రావాల్సి ఉండగా అందులో ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం అత్యంత పాశవి కమని విమర్శలు చేస్తున్నారు. పైగా తమతో అన్ని రకాల ప్రభుత్వ పనులకు వినియోగించుకుంటూ.. చివరకు మొండిచేయి చూపించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

- ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



- అయిత తిరుపతి,

డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, భూపాలపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చాలి. గడిచిన చర్చల్లో ఒప్పుకున్న ఒప్పందం ప్రకారం వెంటనే నిధులు విడుదల చేయాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు విరమణ పొందితే వారికి రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి. ఆసల్యం చేయడం వల్ల ఆ కుటుంబమే ఇబ్బందులకు గురవుతుంది. అనారోగ్యానికి గురైన వారికి, అత్యవసరాలకు కావాల్సిన నిధులు కూడా వెంటనే విడుదలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా ఉదృతం చేస్తాం.